

ఎస్ఎస్ఎ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుకు వినతి

పాలకొల్లు: తమను రెగ్యులర్ చేసి పనికి తగ్గ వేతనం ఇప్పించాలని సమగ్రశిక్ష అభియాన్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఎన్నికలకు ముందు పాదయాత్రలో జగన్ తమను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు దాటినా తమను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె చేస్తేగాని జీతాలు ఇవ్వడం లేదని వాపోయారు. దీనిపై ఎంఎల్ఎ స్పందిస్తూ టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి రాగానే ఎస్ఎస్ఎ ఉద్యోగుల న్యాయమైన కోరికలు తీరుస్తామని హామీ ఇచ్చారు. వేతనాలు ఇచ్చేటప్పుడు తాత్కాలిక ఉద్యోగులుగా పరిగణిస్తూ, సంక్షేమ పథకాలు అమలు చేసినప్పుడు ఉద్యోగులుగా పరిగణించడం సరికాదన్నారు.

'కొల్లేరు'పై.. కపట నాటకం..!

- అక్కడి ప్రజా సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం
- ఉపాధి, అభివృద్ధి లేక విలవిల
- తాజాగా ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో దండయాత్ర
- ప్రజలు, ప్రజాప్రతినిధులు వ్యతిరేకిస్తున్నా ముందుకు
- కొల్లేరు ప్రజలను ఏమార్చేందుకు మాయమాటలు వల్లింపు

కొల్లేరు ప్రజలను పాలకులు తీవ్రంగా వంచిస్తున్నారు. అక్కడి ప్రజలకు అందించాల్సిన ఉపాధి, అభివృద్ధిని గాలికొదిలేసి ఎకోసెన్సిటివ్ జోన్ తెరపైకి తెచ్చి మరో విధ్వంసానికి పూనుకున్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు వ్యతిరేకిస్తున్నా తాము పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్నట్లు ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా చాప కింద నీరులా ఎకోసెన్సిటివ్ జోన్ అమలుపై ముందుకు సాగుతోంది. దీంతో కొల్లేరుపై కపట నాటకం ఆపాలంటూ అక్కడి ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు ప్రాంతం ప్రభుత్వాలకు ఒక ఆట వస్తువులా మారింది. ఎన్నికల ముందు హామీలు గుప్పించి ఓట్లు దండుకోవడం, గెలిచిన తర్వాత కొల్లేరు ప్రజలను మోసగించడం పరిపాటిగా మారిపోయింది. వైసిపి ప్రభుత్వం సైతం అదేబాటలో ముందుకు సాగుతుండటంతో అక్కడి ప్రజల్లో తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. 77 వేల ఎకరాల్లో కొల్లేరు విస్తరించి ఉంది. దాదాపు 120 గ్రామాల పరిధిలో ఐదు లక్షల జనాభా కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్నారు. 2006లో కొల్లేరు ఆపరేషన్ తర్వాత అక్కడి ప్రజల బతుకులు చిరిగిన విస్తరిలా మారాయి. అప్పటి నుంచి కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి తమకు న్యాయం చేయాలని అక్కడి ప్రజలు పోరాడుతూనే ఉన్నారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలంటూ టిడిపి ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో తీర్మానం చేశారు. దీనికి ఆ సమయంలో ప్రతిపక్ష పార్టీగా ఉన్న వైసిపి బేషరతుగా అసెంబ్లీలో మద్దతు తెలిపింది. అయితే అదే వైసిపి అధికారంలోకొచ్చాక అందుకు విరుద్ధంగా ముందుకు సాగుతోంది. వైసిపి అధికారంలోకి వచ్చాక గడిచిన నాలుగున్నరేళ్లలో కొల్లేరు ప్రజల ఉపాధి, ఆ ప్రాంత అభివృద్ధికి సంబంధించి ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యలను పూర్తిగా పక్కన పెట్టేశారు. ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతున్న కొల్లేరు ప్రజలను మరింత చిదిమేసేందుకు ఎకో సెన్సిటివ్ జోన్ ముసుగులో ముందుకు సాగుతోంది. ప్రజల ఆకాంక్షలను పక్కన పెట్టి, వాస్తవాలను దాచి పెట్టి ఎకోసెన్సిటివ్ జోన్ అమలుకు ప్రయత్నాలు చేస్తోంది. ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటు చేస్తే మరో 89 గ్రామాలు కొల్లేరు అభయారణ్యం పరిధిలోకి చేరిపోతాయి. అంతేకాకుండా కొల్లేరులో పరిశ్రమల ఏర్పాటు వంటివి పూర్తిగా నిలిచిపోనున్నాయి. అభివృద్ధి పూర్తిగా స్తంభించపోనుంది. ఇలాంటి అనేక సమస్యలు ఉన్నప్పటికీ ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా మండల కేంద్రాల్లో తూతూమంత్రంగా ఎకోసెన్సిటివ్ జోన్‌పై సమావేశాలు నిర్వహించి మీ నిర్ణయం చెప్పాలని హడావుడి చేశారు. గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండానే చేసినట్లు చెబుతున్నారు. ఈ నెల ఐదో తేదీన కలెక్టరేట్‌లో ఎకోసెన్సిటివ్ జోన్ అమలుపై సమావేశం జరిగింది. కొల్లేరు ప్రాంత ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు పాల్గొన్నారు. ఎకోసెన్సిటివ్ జోన్‌ను కొల్లేరు ప్రాంత ప్రజలతోపాటు ప్రజాప్రతినిధులు సైతం వ్యతిరేకించారు. అయితే తర్వాత కాలంలో ఆ ప్రజాప్రతినిధులను సైతం ప్రభుత్వ పెద్దలు తమ దారిలోకి తెచ్చుకుని వారిని మౌనముద్ర వహించేలా చేశారు. దీంతో ప్రజాప్రతినిధులు పలు ప్రతిపాదనలతో సరిపెట్టారు. ఈ క్రమంలోనే చాపకింద నీరులా ఎకోసెన్సిటివ్ జోన్‌పై జరగాల్సిన పనులను మాత్రం చక్కబెట్టేస్తున్నారు. హెలీకాప్టర్‌తో సర్వే చేయించడం నుంచి అన్ని పనులూ వేగంగా పూర్తి చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ తీరుపై కొల్లేరు ప్రజల్లో తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో తామేమిటో చూపిస్తామంటూ కొల్లేరు ప్రజలు హెచ్చరిస్తున్నారు.

బకాయిలు చెల్లించాలని యుటిఎఫ్ ర్యాలీ

పలుచోట్ల వివిధ రూపాల్లో నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పెండింగులో ఉన్న ఆర్థిక బకాయిలన్నింటినీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన నగరంలో శుక్రవారం సాయంత్రం నిరసన ప్రదర్శన నిర్వహించారు. తొలుత స్థానిక యుటిఎఫ్ కార్యాలయం నుండి అంబికా థియేటర్ మీదుగా పేరయ్య కోనేరు, బిర్లాభవన్ సెంటర్, కూరగాయల మార్కెట్, మున్సిపల్ కార్యాలయం, వసంత్ మహల్ సెంటర్ మీదుగా తిరిగి యుటిఎఫ్ కార్యాలయం వరకూ సాగింది. ఈ సందర్భంగా ర్యాలీలో కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని, కొన్ని సెంటర్లలో మోకాళ్లపై నిలబడి, కొవ్వొత్తులు చేతబూని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముస్తఫా ఆలీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్, జిల్లా సహాధ్యక్షులు వి.కనకదుర్గ, జిల్లా కార్యదర్శులు శివశంకర్రావు, సుధారాణి, కమల్‌కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.మోహనరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పివి.నరసింహారావు, ఆడిట్ కమిటీ సభ్యులు తేరా ప్రసాద్, డివిజన్, మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిలబడి నిరసన

96 శాతం వరినాట్లు పూర్తి

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలో వరి నాట్లు వేసే కార్యక్రమం 96 శాతం పూర్తయ్యిందని వ్యవసాయాధికారి ఉషారాణి తెలిపారు. ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో సాగు విస్తీర్ణం 13,240 ఎకరాలుండగా ఇప్పటి వరకూ నాట్లు పూర్తయిన ప్రాంతంలోని రైతులు ఇ-క్రాప్ నమోదు పూర్తి చేసుకున్నారన్నారు. రైతులు అధిక శాతం తక్కువ కాల వ్యవధిలో దిగుబడినిచ్చే ఎంటియు 1121 రకంతోపాటు పంజాబ్ రాష్ట్రానికి చెందిన పిఆర్ 126 రకం సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం పైరు పిలక దశలో ఉందన్నారు. మండలంలో కొల్లేరు ప్రాంతంలోని వ్యవసాయ క్షేత్రాల్లో నాట్లు పూర్తయిన తర్వాత ముంపు కారణంగా రైతులు కొంతమంది ఇబ్బంది ఎదుర్కొన్నారని తెలిపారు. దీని కారణంగా అతి తక్కువ విస్తీర్ణంలో నాట్లు వేసిన పైరుకు నష్టం వాటిల్లిందన్నారు. దీన్ని సరిచేసే క్రమంలో సదరు రైతులు మండలంలోని ఇతర ప్రాంతాల్లో మిగిలిన నారుతో నష్టపోయిన ప్రాంతంలో నాట్లు వేయటం ద్వారా ఆ లోపాన్ని, ఇబ్బందులను అధిగమించారన్నారు. ఈ ప్రాంతంలో సైతం ఈ వారంలోనే నాట్లు పూర్తవుతాయని, రైతులు ఏవిధమైన ఇబ్బందుల్లేకుండా సాగు కొనసాగిస్తారని అన్నారు.



ముంపు ప్రాంతంలో సాగుతున్న నాట్లు



అభివాదం చేస్తున్న నేతలు

26న ట్రాక్టర్లు, బైకుల ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ ఉద్యమ సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగించిందని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు విమర్శించారు. స్థానిక ఐఎఫ్‌టియు జిల్లా కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా-కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశం శుక్రవారం నిర్వహించారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా రిపబ్లిక్ డే సందర్భంగా ఈ నెల 26న ఏలూరులో నిర్వహిస్తున్న రైతులు, కార్మికుల ట్రాక్టర్లు, బైకుల ర్యాలీని జయప్రదం చేయాలని ఆయా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎఐకెఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోరండ్ల శ్రీనివాస్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి, బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్‌డాంగే, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, కాంగ్రెస్ కిసాన్ సెల్ నగర నాయకులు కెఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ వ్యవసాయ, పారిశ్రామిక, రవాణా, ఖనిజ, సకల సంపదలను అంబాని, అదాని తదితర కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందన్నారు. అందుకు అడ్డుగా ఉన్న చట్టాలను అడ్డగోలుగా మారుస్తూ, ప్రశ్నించిన వారిపైన కేసులు, వేధింపులు సాగిస్తూ ప్రజాతంత్ర హక్కులను రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మోడీ పాలనలో అదాని, అంబాని ప్రపంచ కుబేరుల జాబితాలో చేరగా, పేద రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికులు అప్పుల పాలై ఈ పదేళ్లలో సుమారు లక్షా 50 వేల మంది బలవన్మరణానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాలను నిరసిస్తూ ట్రాక్టర్లు, బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆహార భద్రత చట్టాన్ని పటిష్టపర్చాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. భూహక్కుల చట్టం-2022ను ఉపసంహరించాలని, తుపాను నష్టపరిహారాలను వెంటనే ఇవ్వాలని కోరారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

సంయుక్త కిసాన్ మోర్చా-కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశం అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం ప్రకటించింది. అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించి విరమింపజేయాలని కోరారు.

జగనన్నా.. మా గోడు వినేదెప్పుడన్నా..!

39వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె

ఏలూరులో 24 గంటల రిలే నిరాహార దీక్ష - జిల్లావ్యాప్తంగా అంబేద్కర్‌కు నివాళులర్పించి, వినతులిచ్చి నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండల కేంద్రంలో అంగన్వాడీల సమ్మె 39వ రోజుకు కొనసాగింది. అంగన్వాడీ కార్యకర్తలు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని సమ్మె శిబిరం నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్‌లో ఉన్న వైఎస్ జగన్ బొమ్మ చుట్టూ ఎక్కడ ఉన్నావు జగనన్నా.. నీవు ఏమి విన్నావు జగనన్నా.. మాట తప్పావు జగనన్నా.. మడమ తిప్పావా జగనన్నా.. అంటూ నినాదాలు చేస్తూ ప్రదక్షణలు చేశారు. సిఐటియు మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.సరోజిని, టి.మాణిక్యం ఆధ్వర్యంలో కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు డి.సత్యనారాయణ సంఘీభావం తెలియజేశారు.

ఏలూరు అర్బన్ : నూటికి 70 మందికి పైగా ఉన్న దళిత, గిరిజన అంగన్వాడీ మహిళల సమస్యలు పరిష్కరించకుండా అంబేద్కర్ ఆశయాలు కొనసాగిస్తున్నామని ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య విమర్శించారు. అంగన్వాడీల సమ్మె 39వ రోజు సందర్భంగా ఏలూరు కలెక్టరేట్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సత్యాగ్రహ దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుండా దళితులను ఉద్ధరిస్తున్నామని చెప్పుకోవడం ఎంతవరకు కరెక్ట్ అని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, జిల్లా నాయకురాలు పి.హైమావతి, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వీరంకి సాయిబాబు, సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడారు. శుక్రవారం సత్యాగ్రహ దీక్షలో ఐదు ప్రాజెక్టులకు చెందిన 25 మంది అంగన్వాడీలు 24 గంటల దీక్షలో పాల్గొన్నారు. 39వ రోజు సమ్మె, సత్యాగ్రహ దీక్షల కార్యక్రమానికి శ్రీమతి అరుణ, మల్లిక, స్వప్న, షమీమా, వి.కనకదుర్గ, జయసుధ, వెంకటలక్ష్మి, లత, సీతామాలక్ష్మి, రేణుక, రామలక్ష్మి, విజయలక్ష్మి కెఎన్.వరలక్ష్మి, పి.లక్ష్మి, కృష్ణవేణి, దేవమణి నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగరం, పెదపాడు, దెందులూరు, పెదవేగి మండలాలకు చెందిన వందలాది మంది అంగన్వాడీ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భీమడోలు : భీమడోలు కేంద్రంగా అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెకు శుక్రవారం చిన్నారులు సంఘీభావం తెలిపారు. నేటి కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి సత్కరించారు. తమ సమస్యలను పరిష్కరించే విధంగా పాలకుల మనసులను మార్చాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఇదే క్రమంలో శిబిరాన్ని సందర్శించిన కొందరు చిన్నారులు వారితో పాటు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి సత్కరించారు. అంగన్వాడీలు చేపట్టిన ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

నిడమర్రు : నిడమర్రులో అంగన్వాడీ వర్కర్స్ సమ్మె 39వ రోజు కొనసాగింది. ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా అంగన్వాడీ వర్కర్స్ గ్రామంలో ప్రదర్శన జరిపి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తూ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ 39 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందన్నారు. అంబేద్కర్ ఆశయాలను అమలు చేయలేని జగన్మోహన్‌రెడ్డికి ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో బి.సుభాషిని, వెంకటలక్ష్మి, కె.జయమ్మ, ఉమామహేశ్వరి, ఎ.నాగమణి, ఎన్.సత్యవతి, స్వరాజ్యం లక్ష్మి, జి.అనురాధ పాల్గొని మాట్లాడారు.



చింతలపూడిలో కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని జగన్ ఫోటోతో నిరసన

పోలవరం : మండలంలో 39వ రోజు మెయిన్ రోడ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం అంగన్వాడీలు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. సిఐటియు మండల కార్యదర్శి పిఎల్ఎస్.కుమారి ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో జరుగుతున్న అంబేద్కర్ విగ్రహం ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామంలో సమ్మె శిబిరం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుజాత, పద్మావతి, సత్యవేణి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమ్మె శిబిరంలో పాల్గొన్నారు

ముసునూరు : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నూజివీడు ప్రాజెక్టు కార్యదర్శి పల్లిపాము రాజకుమారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలోని దళితవాడలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి తమ న్యాయమైన డిమాండ్ల పత్రాన్ని మండలంలోని 16 గ్రామాల అంగన్వాడీలతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గ, మేరీ సులోచన, లక్ష్మి, విజయలక్ష్మి, కలపాల విద్యావతి, శిరీష, వెంకటేశ్వరమ్మ, అలివేలు మంగమ్మ, సుజాత పాల్గొన్నారు.

ముదినేపల్లి : తమ సమస్యలు పరిష్కారం కోరుతూ ముదినేపల్లిలో అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారంతో 39వ రోజు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు శిబిరం వద్ద నుంచి ర్యాలీగా పెద్ద ఎత్తున నినాదాలు చేసుకుంటూ బస్టాండ్‌నున్న అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఈ ర్యాలీకి అరుణ, పద్మ, రిబ్కా, మణి నాయకత్వం వహించారు.

కొయ్యలగూడెం : మండల కేంద్రంలో అంగన్వాడీల సమ్మె 39వ రోజు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీది న్యాయమైన పోరాటం అని, సమస్యలు పరిష్కారం దిశగా ప్రభుత్వం కదలి రాకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తాం అని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శుక్ల బోయిన రాంబాబు, అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు శివరత్న కుమారి, పి.పద్మజ, జె.నాగవేని, అడపా నాగజ్యోతి, సిహెచ్.సునితరయల్, బొబ్బిలి చిట్టి, కె.జ్యోతి, కె.మాధవి, పి.భాగ్యలక్ష్మి, ఎమ్.వెంకటలక్ష్మి, ఎమ్.మంగా, శ్రీదేవి పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె నిరంతరాయంగా కొనసాగుతూ శుక్రవారానికి 39వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నిరసన తెలిపారు. అనంతరం దీక్ష శిబిరం వద్దకు చేరుకొని రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వారికి సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్, జిల్లా అంగన్వాడీ యూనియన్ నాయకులు మణి, అంతోనమ్మ, స్వప్న సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన కోరికలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొండలరావు, అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, సరళ, వరలక్ష్మి, మంగ పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 39వ రోజు కొనసాగింది. అంగన్వాడీలు విధులకు హాజరు కావాలని లేకుంటే కేంద్రాలను ఆశా, వాలంటీర్లతో నడుపుతామనే బెదిరింపులకు లొంగేది లేదని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. అంగన్వాడీ సంఘం నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : అంగన్వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోరుతూ చేస్తున్న సమ్మెలో భాగంగా శుక్రవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. కనీస వేతనాలు పెంచాలని నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు.

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్వాడీల నిరసన దీక్ష శుక్రవారం నాటికి 39వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జి.రాజు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని, ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్.హనుమాన్లు, విజయలక్ష్మి, నరసింహారావు, పద్మజ్యోతి పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : సామాజిక న్యాయం కోసం గత 39 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆగిరిపల్లి మండల సిఐటియు కార్యదర్శి ఆర్.చంటి డిమాండ్ చేశారు. విజయవాడలోని అంబేద్కర్ సామాజిక న్యాయ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా అంగన్వాడీల సమ్మెలో భాగంగా ఆగిరిపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, అంగన్వాడీ నాయకులు పి.అన్నమ్మ, ఎం.అనురాధ, పి.సంతోష్ రూప, బి.జ్యోతి, అరుణ, పుల్లమ్మ పాల్గొన్నారు.

చాట్రాయి : అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం కొనసాగింది. చాట్రాయి మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న సమ్మె శిబిరం వద్దకు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు పాల్గొని మాట్లాడారు. అనంతరం నినాదాలు చేస్తూ సెంటర్‌కు ర్యాలీగా వెళ్లి బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వినతిని సమర్పించారు. ఈ కార్యక్రమానికి విజయ, ప్రమీలరాణి, దయామని, శ్రీదేవి, సుమలత, జ్యోతి నాయకత్వం వహించారు.

మండవల్లి: రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి అంగన్వాడీ సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె ఉపసంహరిస్తామని అంగన్వాడీలు స్పష్టం చేశారు. అంగన్వాడీలు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నా 39వ రోజు కొనసాగింది. శుక్రవారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ లీడర్స్ చెల్లమ్మ, వాణి, ఉమాదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.



భీమడోలులో..



ఏలూరులో..



ఆగిరిపల్లిలో..



కలిదిండిలో..



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీ నాయక్

హెచ్‌ఐవి బాధితులను ప్రేమతో ఆదరించాలి

ప్రజాశక్తి - ముసునూరు

హెచ్‌ఐవితో జీవిస్తున్న వారిని ప్రేమతో ఆదరించాలని, వారిని వివక్షతకు గురి చేయవద్దని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ లక్ష్మీ నాయక్ తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ వారి సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం వారి ఆధ్వర్యంలో శుక్రవారం అక్కిరెడ్డిగూడెం గ్రామ సచివాలయంలో అవగాహన మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నాయక్ మాట్లాడుతూ హెచ్‌ఐవి అనేది కేవలం సురక్షితం కాని లైంగిక సంబంధాల ద్వారానే వ్యాప్తి చెందుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం సూపర్‌వైజర్ సుందర్ రావు, ఎంపిహెచ్ సేతమ్మ, సచివాలయం కార్యదర్శి విద్యాధరరావు, వాలంటీర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

28 వరకూ కులగణన : ఎంపిడిఒ

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో కులగణన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైందని భీమడోలు ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి తెలిపారు. శతాబ్ద కాలం తర్వాత చేపట్టిన కులగణన కార్యక్రమం ఈనెల 28వ తేదీ వరకు ఇంటింటి సర్వే కొనసాగుతుందన్నారు. మండల పరిధిలో సుమారు 53 వేల మంది జనాభా ఉన్నారని, కుల గణన కార్యక్రమం కోసం 356 మంది ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు పనిచేస్తున్నారన్నారు. వీరికి సహకరించేందుకు మండల స్థాయిలో 39 మంది సభ్యులు గల టీం ఒకటి కంట్రోల్ రూమ్ పనిచేస్తుందన్నారు. వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ యజమాని నుంచి మౌలిక విషయాలు సేకరించి దానిపై కుటుంబ యజమాని, వాలంటీర్ ఇకెవైసి చేస్తున్నారు. సర్వే సమయంలో అందుబాటులో లేనివారు ఈనెల 29వ తేదీ నుంచి ఫిబ్రవరి రెండో తేదీ లోగా తమ పరిధిలోని గ్రామ సచివాలయాల వద్దకు వెళ్లి వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా భీమడోలు హైస్కూల్ గ్రౌండ్ వేదికగా శుక్రవారం నిర్వహించిన ఖోఖో పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయని ఎంపిడిఒ తెలిపారు.



బహుమతులు అందజేస్తున్న జెడ్‌పిటిసి

క్రీడాకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

యువకులు క్రికెట్ పట్ల ఎక్కువ మక్కువ చూపుతున్నారని, గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలని చింతలపూడి జెడ్‌పిటిసి మోలుగుమాటి నీరజసుధాకర్, వైసిపి సీనియర్ నాయకులు గిరి భోగరావు అన్నారు. మండలంలోని రాఘవపురం గ్రామంలో రాఘవ పురం కపిల్ క్రికెట్ 38వ టోర్నమెంట్ విజేత అక్షర టీమ్ రాఘవపురం వారికి ప్రైజ్ మనీ రూ.50,116, కప్‌ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల్లో ఎంతో నైపుణ్యం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పోతునూరు సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరికి యావజ్జీవ కారాగార శిక్ష

ఏలూరు స్పోర్ట్స్ : రెండు వేరువేరు కేసులలో ఒకేరోజు ఇద్దరు ముద్దాయిలపై నేరం రుజువు కావడంతో వారిద్దరికి యావజ్జీవ కరాగార శిక్ష విధిస్తూ పోస్కో స్పెషల్ కోర్టు మెజిస్ట్రేట్ శుక్రవారం తీర్పునిచ్చింది. మైనర్ బాలికను అత్యాచారం చేసిన కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవిత ఖైదు, రూ.5వేలు జరిమానా విధించారు. ఈ కేసులో బాధిత బాలికకు రూ.3 లక్షలు పరిహారం చెల్లించాల్సిందిగా ఏలూరు పోస్కో కోర్టు జడ్జి ఎస్.ఉమాసునంద శుక్రవారం తీర్పు వెలువరించారు. ఈకేసుకు సంబంధించి బుట్టాయగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ నెం.17/2014లో బుట్టాయగూడెం మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన కుంజా సోమరాజు(41)కు శిక్షను విధించారు. కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాధిత మైనర్ బాలిక(14) 2014లో సోమరాజు కొత్త పుస్తకాలు ఇస్తానని చెప్పి తన రూముకి తీసుకొని వెళ్లి ఆమె పట్ల అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. దీంతో బాలిక తల్లిదండ్రులు బుట్టాయగూడెం పోలీసులను ఆశ్రయించారు. దీనిపై అప్పటి ఎఎస్‌ఐ జయరాజు కేసు నమోదు చేశారు. ఈ కేసులో అప్పటి సిఐ మురళీ రామకృష్ణారావు 2014, జనవరి 22న ముద్దాయిని అరెస్టు చేయగా అప్పటి జంగారెడ్డిగూడెం డిఎస్‌పి అల్లూరి వెంకట సుబ్బరాజు దర్యాప్తు చేశారు. అనంతరం ముద్దాయిపై ఛార్జీ షీట్ను కోర్టులో ఫైల్ చేశారు. ముద్దాయికి జీవిత ఖైదు పడుటలో సమర్థవంతంగా పనిచేసిన ఎపిపి రామాంజనేయులు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి అభినందించారు.

పోస్కో కేసులో ముద్దాయికి 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించడంతో పాటు బాధిత మహిళలకు రూ.2 లక్షలు పరిహారం ఇవ్వాల్సిందిగా ఏలూరు పోస్కో స్పెషల్ కోర్టు జడ్జి ఎస్.ఉమా సునంద శుక్రవారం తీర్పు నిచ్చారు. దీనికి సంబంధించి పోలీసులు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డివి రామాంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ నెంబర్ 221/2018 సంబంధించి ఉంగుటూరు మండలం సుబ్బారాయుడు పేటకు చెందిన ఈదుపల్లి వెంకట దుర్గాప్రసాద్‌పై కేసులో నేరం రుజువైనందున శిక్షను ఖరారు చేశారు. ముద్దాయి అయిన ఈదుపల్లి వెంకట దుర్గాప్రసాద్ అలియాస్ సాయి(20) 2018 ఆగస్టు 28వ తేదీ సాయంత్రం 6.30 సమయంలో ఫిర్యాది ఇంటి వద్దకు వచ్చి ఫిర్యాది కూతురు ఆంజనేయరాజు ఇంటి వద్ద అడుకుంటుండగా చిన్నారిని డాబాపైకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడుతుండగా ఫిర్యాదు గమనించి కేకలు వేయగా ముద్దాయి పారిపోయాడు. దీన్నిపై ఫిర్యాది చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ నాగ వెంకట రాజు కేసు నమోదు చేసి అప్పటి ఏలూరు డిఎస్‌పి కె.ఈశ్వరరావు ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ కేసుకు సంబంధించి కోర్టు ఎదుట వాదనలను అడిషనల్ పిపి డివి.రామాంజనేయులు వినిపించారు. శుక్రవారం శిక్ష విధించారు. ఈ కేసులో సాక్షులను కోర్టులోకి ప్రవేశ పెట్టి ముద్దాయికి శిక్ష పడేందుకు సహకరించిన నిడమర్రు సిఐ ఎం.సుభాష్, చేబ్రోలు ఎస్‌ఐ మణి కుమార్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వి.ప్రసాద్లను జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి అభినందించారు.

నేరాలు - ఘోరాలు

చెరువులో పడి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

బట్టలు ఉతికేందుకు చెరువుకు వెళ్లిన వృద్ధురాలు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందిన సంఘటన శుక్రవారం ముదినేపల్లిలో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం ముదినేపల్లి అంబేద్కర్ కాలనీకి చెందిన కటికల సరోజిని(70) అనే వృద్ధురాలు ఉదయం 6 గంటల సమయంలో పెదరామాలయం దగ్గర ఊర చెరువు మెట్ల రేవు వద్ద బట్టలు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు జారి చెరువులో మునిగి మృతి చెందింది. చెరువులో మృతదేహం తేలి కనబడడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి కుమారుడు దానియేలు వచ్చి చెరువులో నుంచి మృతదేహన్ని బయటికి తీసి ఇంటికి తరలించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని కనకపురం గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వి.చంద్ర శేఖర్ తెలిపారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు చేయగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2,800 నగదును స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

భూయాజమాన్య హక్కుల చట్టం రద్దు చేయాలి

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి - సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - పెదపాడు

రైతులు, ప్రజలకు నష్టం కలిగించే భూయాజమాన్య హక్కుల చట్టం–2022ను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. శుక్రవారం పెదపాడులోని నగ్గా ఆంజనేయులు భవనంలో నిర్వహించిన సిపిఎం పెదపాడు గ్రామ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కుల చట్టం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంబానీ, ఆదానీ వంటి కార్పొరేట్లకు రైతుల భూములను కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నీతి ఆయోగ్ తీసుకువచ్చిన ఈ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వేలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. భూ సమస్యలపై కోర్టులకు వెళ్లే వీలు లేకుండా ఈ చట్టాన్ని తీసుకోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రైతులు, ప్రజల హక్కులను హరించి వేసే భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 39 రోజులుగా అంగన్వాడీలు పెద్ద ఎత్తున సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని విమర్శించారు. అంగన్వాడీల ఉద్యమాన్ని అణిచివేయాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేయడం తగదన్నారు. ఎస్మా వంటి చట్టాలను ప్రయోగించి అంగన్వాడీలను భయపెట్టడం ప్రభుత్వ నియంతృత్వ, నిరంకుశ చర్యలకు నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, నాయకులు మావూరి శ్రీనివాసరావు, పిట్టా రహుహేలు, షేక్ కరీముల్లా, జె.సాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవి

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు అభినందనీయం

విజయవాడలో విగ్రహావిష్కరణకు జిల్లా నుంచి భారీగా తరలి వెళ్లిన ప్రజలు



చింతలపూడిలో జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న విజయరాజు

ప్రజాశక్తి - చింతలపూడి

విజయవాడ నడిబొడ్డులో 125 అడుగుల విగ్రహం పెట్టటం అభినందనీయమని ఎయిమ్ రాష్ట్ర నాయకులు ఎస్ఎస్.రాజేంద్ర, ఎయిమ్ నాయకులు కాకర్ల సత్యం అన్నారు. చింతలపూడి పట్టణంలో ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చింతలపూడి నియోజకవర్గ వైసిపి కన్వీనర్ కంభం విజయరాజు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఘన నివాళులర్పించి, విగ్రహానికి పాలాభిషేకం చేశారు. విజయవాడలో జరిగే అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంకు వెళుతున్న బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జగ్గవరపు జానకి రెడ్డి, పట్టణ వైసిపి అధ్యక్షుడు కొప్పుల నాగేశ్వరరావు, వైసిపి నాయకులు గద్దమడుగుల రాజేష్ నాయుడు, గంధం చంటి పాల్గొన్నారు.

ముదినేపల్లి: విజయవాడ నగర నడిబొడ్డున ఆకాశమంత ఎత్తున బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహ ఆవిష్కరణకు ముదినేపల్లి మండలం నుంచి భారీ ఎత్తున దళితులు బయలుదేరి వెళ్లారు. రాష్ట్ర మాల మహానాడు, అనుబంధ సంఘాల అధ్యక్షులు డాక్టర్ సేవా నాగ జగన్ బాబురావు ఆధ్వర్యంలో దళితులు విజయవాడ తరలి వెళ్లారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల నుంచి వేలాదిగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్‌టిసి బస్సుల్లో జనం బయలుదేరి అంబేద్కర్ విగ్రహావిష్కరణకు వెళ్లారు.


భీమడోలు : సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ, సామాజిక సమతా సంకల్ప సభ కార్యక్రమాలకు భీమడోలు మండలం నుంచి ప్రజలను తరలించేందుకు ఏర్పాటు చేసిన ఏడు బస్సులకు అదనంగా మరొక రెండు బస్సుల కేటాయింపు జరిగిందని భీమడోలు ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి తెలిపారు. దీంతో కార్యక్రమంలో పాల్గొనే వారి సంఖ్య 350 నుంచి 450కి పెరిగిందన్నారు. గుండుగొలనులో బస్సుల ర్యాలీని గ్రామ ఉపసర్పంచి, వైసిపి గ్రామ అధ్యక్షులు ముదుండి సూర్యనారాయణ రాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి శంకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి మురళీ, వైసిపి గ్రామ సచివాలయాల కన్వీనర్ జి.మురళీ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: విజయవాడలో ఏర్పాటు చేసిన సామాజిక న్యాయ మహా శిల్పం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ, అనంతరం నిర్వహించే సామాజిక సమతా సంకల్ప సభకు ఆగిరిపల్లి మండలం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు బస్సుల్లో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో వైసిపి టౌన్ అధ్యక్షులు చిమట శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు సాదం గోపినాథ్, వైసిపి మండల ఉపాధ్యక్షులు మల్లంపల్లి రవిశేఖర్, ఎంఆర్‌పిఎస్ నాయకులు కంబాల ప్రదీప్‌లు పాల్గొన్నారు.

టి.నరసాపురం : విజయవాడలో నిర్మించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి శుక్రవారం మండలంలోని బంధంచర్ల, టి.నరసాపురం, రుద్రకోటరాజుగూడెం, ఇందిరాకాలనీ తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో అంబేద్కర్ యువత, వైసిపి నాయకులు, ఇతర ప్రజా ప్రతినిధులు తరలి వెళ్లారు. బంధంచర్ల, టి.నరసాపురం గ్రామాల్లో ముందుగా అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌టిసి బస్సులు, కారులు, ఇతర వాహనాల్లో తరలి వెళ్లారు.

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలోని మైలవరం రోడ్డులో ఉన్న బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేసుకోవడం గర్వించదగ్గ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండవల్లి : నిజమైన అంబేద్కర్ వాది అంటే అది కేవలం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరావు అన్నారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున దళితులు, అంబేద్కర్ వాదులు శుక్రవారం తరలి వెళ్లారు. ముందుగా ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరావు స్థానిక సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ఎస్.భాస్కరరావు, ఇఒపిఆర్‌డి ఆనందబాబు, కార్యదర్శి శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో తరలివెళ్తున్న ప్రజలు



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న ఎంపిడిఒ

ఉపాధి హామీ చట్టంపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - పోలవరం

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం పోలవరం ఎంపిడిఒ జి.శ్రీను అధ్యక్షతన డ్వామా ఏపీడీ పురుషోత్తం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. మండలంలో 2022–23గానూ 16వ విడత ఉపాధి హామీ చట్టంతో పాటు పలు సంక్షేమ పథకాల సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలు పంచాయతీలకు చెందిన క్షేత్ర సహాయకులు నిర్వహించిన పనులపై తనిఖీ బృందం క్షేత్రస్థాయి పనులపై మండలస్థాయిలో ప్రజా వేదిక సభ నిర్వహించి సామాజిక తనిఖీపై గ్రామాలవారీగా నివేదికలను ప్రజాప్రతినిధుల సమక్షంలో చదివి వినిపించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 779 వివిధ రకాల పనులుగాను రూ.16.73 కోట్లు ఖర్చు చేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంపిడిఒ జి.శ్రీను, ఎంపిపి సుంకర వెంకట రెడ్డి, డ్వామా ఏపీడీ పురుషోత్తం, డిస్ట్రిక్ విజిలెన్స్ అధికారి విజయ లక్ష్మి, జంగారెడ్డిగూడెం క్లస్టర్ ఇన్‌ఛార్జి డి.దామోదరరావు పాల్గొన్నారు.

బిసిల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

చింతలపూడి : బిసిల సంక్షేమ అభివృద్ధి కేవలం నారా చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ చక్రవర్తి అన్నారు. పార్టీ పిలుపు మేరకు మండలంలోని రాఘవపురంలో పార్టీ మండల అధ్యక్షుడు మాటూరి వెంకట్రామయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శేషు అధ్యక్షతన జయహో బిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజక వర్గ టిడిపి బిసి సెల్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎంఎల్‌ఎలు చింతమనేని ప్రభాకర్, ఘంటా మురళీ, రామకృష్ణ, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జె.ముత్త రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు వైద్యం అందించడమే 'జగనన్న సురక్ష' లక్ష్యం

ప్రజాశక్తి - ముసునూరు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద, బడుగు, బలహీన వర్గాల వారికి వైద్య సేవలు అందించడంలో మరో ముందడుగు వేసిందని జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనలు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో లోపూడి గ్రామంలోని వెల్నెస్ సెంటర్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంపిపి కొండా దుర్గ భవాని వెంకటరావు, సర్పంచి పేరం కృష్ణల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని వర్గాల వారికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు అందజేశారు. కొందరికి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, వైద్యులు డాక్టర్ పైదా వెంకటేశ్వరరావు, డాక్టర్‌లు సుల్తాన, దీప్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ముసునూరు : జగనన్న సురక్ష నిర్వహిస్తున్న వైద్యులు



జీలుగుమిల్లి : జగనన్న సురక్ష నిర్వహిస్తున్న వైద్యులు

ముదినేపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శమని సింగరాయపాలెం గ్రామ సర్పంచి విమలా రామరాజు అన్నారు. మండలంలోని సింగరాయపాలెం గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో గురజ పిహెచ్‌సి వైద్యులు తరణి, ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి వైద్యులు హేమ చౌదరి, సుస్మిత పాల్గొని 350 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో ఇద్దరిని రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేత బోయిన రామరాజు, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం జగనన్న సురక్ష క్యాంప్‌ల ద్వారా అందించడం జరుగుతుందని జెడ్‌పిటిసి మల్లం వసంతరావు అన్నారు. శుక్రవారం మండలంలోని అంకన్నగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సురక్ష శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సురక్ష క్యాంప్‌కి వచ్చిన వారికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరిగిందని వైద్యాధికారి దివ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పైదా ముత్యాలమ్మ, సమియేల్ బాషా, కరిముల్లా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ముదినేపల్లి : రోగులు పరీక్షిస్తున్న వైద్యులు



మాట్లాడుతున్న అభిషేక్

మత్స్యకారుల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెంలో మత్స్యకారుల సహకార సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవమైంది. గ్రామానికి చెందిన సామాజిక వేత్త పెండ్యాల అభిషేక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలో సంఘం నూతన అధ్యక్షుడిగా బత్తుల రమేష్, కార్యదర్శిగా ములికి ఏసు, కోశాధికారిగా బుడుపుల రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ సంఘం ఏర్పడిన 20 ఏళ్ల కాలంలో సంఘ కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక కావడం మొదటిసారి అన్నారు. సభ్యులందరూ ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. మత్స్యకార సంక్షేమాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘ సభ్యులు ఐక్యతతో పనిచెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు గుండె పోతురాజు, ధనరాజు, చిట్టియ్య, జక్రయ్య పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ విజేతలుగా ఏలూరు, హైదరాబాద్ జట్లు

నూజివీడు రూరల్ : పట్టణంలోని డిఎఆర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న కళా ప్రపూర్ణ రాజా వెంకటాద్రి అప్పారావు 47వ మెమోరియల్ బాస్కెట్‌బాల్ పోటీల్లో మహిళా విజేతగా ఏలూరు జట్టు నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో ఏలూరు జట్టు చత్తీస్‌ఘడ్ జట్టుపై 58–52 స్కోరు తేడాతో విజయం సాధించింది.

నూజివీడు పట్టణంలో డిఎఆర్ కాలేజీ ఆవరణలో బాస్కెట్‌బాల్ పోటీల పురుషుల విజేతగా హైదరాబాద్‌కు చెందిన జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు బహుమతులను అందజేశారు.

64 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

రూ.1.57 లక్షల విలువని అంచనా

ప్రజాశక్తి - భీమడోలు

ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం లంకపల్లి గ్రామం నుంచి తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న 64 బస్తాల బియ్యం భీమడోలు మండలం సూరప్పగూడెం వద్ద పౌరసరఫరాల శాఖ అధికారులు శుక్రవారం నిర్వహిస్తున్న తనిఖీల్లో పట్టుబడింది. బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.5 లక్షలు విలువ గల రవాణా వాహనంతో పాటు పట్టుబడిన 3,930 కేజీల బియ్యాన్ని అధికారులు స్వాధీన పర్చుకొన్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.1.57 లక్షలు ఉంటుందని అంచనా. స్వాధీన పరుచుకొన్న బియ్యం బాధ్యతను సూరప్పగూడెం రేషన్ షాప్‌కు అప్పగించినట్లు పౌరసరఫరాల శాఖ భీమడోలు డిప్యూటీ తహశీల్దార్ ఎ.మాధవరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు లంకపల్లి గ్రామానికి చెందిన నీలాల భవానీ ప్రసాద్ సమీప గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించారు. ఈ విధంగా సేకరించిన బియ్యాన్ని 64 బస్తాల్లో భద్రపరిచి సింహాద్రిపురం తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. సింహాద్రిపురంకు చెందిన రవాణా వాహన యజమాని మొగలి నాగ మురళీ రవాణా వాహనంపై తాత్కాలిక డ్రైవర్‌గా పనిచేస్తున్న అదే గ్రామానికి చెందిన మొగలి వరహాలు ఆ బియ్యాన్ని తమ రవాణా వాహనంలో తరలించేందుకు లోడింగ్ చేసుకున్నారు. సింహాద్రిపురం తరలించే క్రమంలో ముగ్గురు రవాణా వాహనంతో పాటు ప్రయాణించ సాగారు. ఈ నేపథ్యంలో సూరప్పగూడెం వద్ద వాహనం తనిఖీల సందర్భంగా పట్టుబడింది. రవాణా వాహనాన్ని, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పౌరసరఫరాల శాఖ అధికారులు వారిపై నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసు నమోదు చేశారు.

భేషుగ్గా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు

ఎంపీ వివేక్ ఠాకూర్

ప్రజాశక్తి - ఏలూరు

కేంద్ర ప్రభుత్వ పథకాల అమల్లో, వికసిత్ భారత్ సంకల్ప కార్యక్రమం నిర్వహణలో జిల్లా పనితీరు భేషుగ్గా ఉందని రాజ్యసభ సభ్యులు, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు వివేక్ ఠాకూర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమ నిర్వహణ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణిలతో కలిసి సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఆయా పథకాల అమలుకు సంబంధించి మరిన్ని సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా వివేక్ ఠాకూర్ మాట్లాడుతూ దేశ ప్రజలకోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అందరికీ అన్ని పథకాల లబ్ధి చేకూరేలా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మయోజన కింద చేతివృత్తుల వారిని ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ఈ కార్యక్రమానికి ఇంతవరకు 4,224 దరఖాస్తులు అందాయని, ఇంకా మరింత మంది దరఖాస్తు చేసుకొని ప్రయోజనం పొందేలా చూడాలన్నారు. జిల్లాలో వికసిత్ భారత సంకల్పయాత్ర చేపట్టక ముందు, చేపట్టిన తర్వాత సంబంధిత అంశాల్లో ప్రగతి తీరు నివేదికను అందజేయాలని ఆయన కోరారు. ప్రధానమంత్రి ఆవాసయోజన, కిసాన్ క్రెడిట్ కార్డ్, తదితర కార్యక్రమాల అమలు తీరుపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 ప్రధాన పథకాల ప్రగతి తీరును వివరించారు. కేంద్ర ప్రభుత్వం పటిష్టాత్మకంగా అమల్లోకి తీసుకువచ్చిన వికసిత్ బారత్ సంకల్పయాత్ర కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇంతవరకు 465 గ్రామ పంచాయతీల పరిధిలో ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, డిఇఒ శ్యాంసుందర్, డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ట, జిల్లా పరిశ్రమల కేంద్రం జియం ఆదిశేషు, డిఎస్ఒ ఆర్ఎస్ఎస్ రాజు, ఎల్‌డిఎం నీలాద్రి, ఎపిఎంఐపి పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

లింగపాలెం : వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లింగపాలెం మండలం ముడిచర్ల, బోగోలు గ్రామపంచాయతీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు, స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ వివేక్ ఠాగూర్, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్ర, జెడ్‌పి సిఇఒ సుబ్బారావు, అగ్రికల్చర్ జెడి రామకృష్ణ, అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్ కిషోర్, బోగోలు సర్పంచి తాడేపల్లి శాంతారావు, ముడిచెర్ల సర్పంచి రావి రమాదేవి, వెంకటేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ ఒంటెద్దు యేసు వరప్రసాద్ పాల్గొన్నారు.